# జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు


మాజీ మంత్రి హరీశ్‌రావు


ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


మాజీ ఎమ్మెల్యే వొడితెల

సిద్దిపేట కమాన్,/దుబ్బాక/ చేర్యాల/హుస్నాబాద్, జనవరి 14 : మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సకల సంపదలతో సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందంగా జరుపుకోవాలన్నారు. సంక్రాంతి ప్రతిఒక్కరి జీవితాల్లో నూతన కాంతి తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని, పసిడి పంటలతో పరిఢవిల్లాలన్నారు. భోగి పండగ మన అందరికీ భోగభాగ్యాలు ప్రసాదించాలని, కనుమ పండగ కనువిందుగా జరుపుకోవాలన్నారు. సంక్రాంతి పండగ ప్రజల జీవితంలో నిత్యం కాంతులు విరిసిల్లాలని భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి , చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ప్రజలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి , హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రజలందరి ఇండ్లలో సంతోషాలను నింపాలని, ప్రజలందరూ భోగభాగ్యాలు, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# బయ్యన్న గుండ్ల జాతరకు ముస్తాబు

- నేటి నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు
- అనాజీపూర్‌లో ఆధ్యాత్మిక శోభ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు


ఉత్సవాలకు ముస్తాబైన బయ్యన్నగుండ్లు

రాయపోల్, జనవరి 14 : మండలంలోని అనాజీపూర్‌లో నేటి నుంచి మూడు రోజుల పాటు బయ్యన్నగుండ్ల జాతర కొనసాగనుంది. ఏటా సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. బయ్యన్నగుండ్లను రంగులతో అందంగా అలంకరించి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భగంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం వద్ద ఎడ్ల బండ్ల ఊరేగింపు, జాతర కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామంలో దుర్గమ్మ ఆలయం వద్ద బండ్ల ఊరేగింపు, బోనాల శోభాయాత్ర, జాతర కొనసాగుతుంది. జాతర సందర్భంగా అనాజీపూర్‌లో పండుగా వాతావరణం నెలకొంది.

# కనుల పండువగా సదరు పటం ఉత్సవాలు


అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

జగదేవ్‌పూర్, జనవరి 14 : మండలంలోని తీగుల్‌నర్సాపూర్ ప్రసిద్ధ కొండపోచమ్మ ఆలయంలో ఆదివారం సదరుపటం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆనవాయితీ ప్రకారం బోగి నాడు సర్పంచ్ రజితారమేశ్ ఆలయ అధికారుల ఆధ్వర్యంలో బైండ్ల కులస్తులు రంగురంగులతో బోనాలు అలంకరించి అమ్మవారికి నైవేద్యం పెట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు రకాల రంగులతో సదరుపటం వేసి అమ్మవారికి పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి పూజలు చేసి సదరుపటం తొక్కారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు హైదరాబాద్ జంటనగరాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొండపోచమ్మ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో మోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, కొండపోచమ్మ ఆలయ మాజీ చైర్మన్లు హనుమంతరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ‘మల్లన్న’ మమ్మేలు స్వామి

**కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న 25 వేల మంది భక్తులు**


మల్లన్న ఆలయ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

చేర్యాల, జనవరి 14 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో నిండిపోయింది. ‘మల్లన్న స్వామి.. మమ్మేలు స్వామి’ అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో శైవ క్షేత్రం పులకరించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 25 వేల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ ఈవో బాలాజీశర్మ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకోవడంతోపాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బి య్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపై ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతోపాటు మట్టి పాత్రలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షిణలు, కోడె స్తంబం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యుడు తాళ్లపల్లి రమేశ్, ఏఈవోలు వైరాగ్యం అంజయ్య, కత్తి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేశ్

కొండపాక, జనవరి 14 : మండలంలోని దుద్దెడ ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ గ్రామ అధ్యక్షుడిగా మిద్దె రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామంలో ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడిగా మిద్దె రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బాకీ ప్రభాకర్, కోశాధికారిగా మిద్దె శివకుమార్, ఉపాధ్యక్షుడిగా పం జాల శ్రీనివాస్‌తోపాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

గజ్వేల్ అర్బన్, జనవరి 14 : గజ్వేల్ పట్టణ పద్మశాలీ యువజన సంఘం నూతన క్యాలెండర్‌ను ఆదివారం గజ్వేల్‌లో సంఘం అధ్యక్షుడు తలకొక్కుల దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీ యువత సేవా కార్యక్రమాల్లో ముందుంటుందన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు మరింత సేవలందిస్తూ పద్మశాలీల ఔన్నత్యాన్ని చాటాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్, గౌరవాధ్యక్షులు స్వర్గం రాజేశం, సీనియర్ అడ్వకేట్ గుండు కాళీ ప్రసాద్, నాయకులు లింగం, లక్ష్మణ్, పెంటయ్య, మల్లేశం, చంద్రశేఖర్, సతీశ్ కుమార్, వాసు, హనుమాన్‌దాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## కాపుల సంక్షేమానికి కృషి

సిద్దిపేట టౌన్, జనవరి 14 : మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మున్నూరు కాపుల సంఘం క్యాలెండర్‌ను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పాల సాయిరామ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మున్నూర్ కాపు నిత్య అన్నదాన సత్రం 11వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను జిల్లా నాయకులకు అందజేశారు.

# భక్తుల కోరికలు తీర్చే ‘బండ మల్లన్న’

- ప్రకృతి అందాల నడుమ మల్లన్న జాతర
- సంక్రాంతి పర్వదినాన బండపై సంబురాలు
- పుట్టు గుండం విశిష్టత


జాతర జరిగే బండ మల్లన్న గుట్ట


బండపై ఎల్లమ్మదేవి అమ్మవారి విగ్రహాలు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), జనవరి 13 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి-జంగపల్లి గ్రామల శివారులోని బండపై వెలసిన బండ మల్లన్న భక్తుల కొంగు బంగారమై కోరికలు తీరుస్తున్నాడు. బండపై ఏటా సంక్రాంతి పండుగ పర్వదినాన బండ మల్లన్న జాతర జరుగుతుంది. దాదాపు 120 ఎకరాల విస్తీర్ణం, 116 గజాల ఎత్తు ఉన్న బండపై పరమేశ్వరుడు మల్లన్న దేవుడిగా అవతరించాడు. విశాలమైన బండపై రాజరాజేశ్వరస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయం, పాండవుల విగ్రహాలు, హనుమాన్, నాగదేవత, పోషమ్మ ఆలయాలతోపాటు పుట్టు గుండం, మల్లన్న పాద ముద్రలలు, దేవత విగ్రహాలు భక్తులకు దర్శనమిస్తుంటాయి. జనవరి మొదటి వారంలో బండపై బోనాలతో సంబురాలు ప్రారంభమై సంక్రాంతి పండుగ వరకు కొనసాగుతాయి. బండ మల్లన్న చుట్టూ ఉన్న గ్రామాలు వీరారెడ్డిపల్లి, జంగపల్లి, అల్మాజీపూర్, చెప్యాల, దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి గ్రామాలకు చెందిన భక్తులు బోనాల బండ్లను బండపై కొలువుదీరిన మల్లన్న దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఇక్కడి ఆనవాయితీగా వస్తున్నది. బండపై సహజ సిద్ధంగా వెలసిన పుట్టు గుండంలో ఎన్ని కరువు కాటకాలు వచ్చినా నేటికీ నీరు పుష్కలంగా ఉండడం మల్లన్న దేవుడి మహిమగా ప్రజలు కొనియాడుతారు. పుట్ట గుండంలోని నీరును ఆయా గ్రామాల రైతులు తమ పొలాల్లో చల్లితే పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం. మల్లికార్జునస్వామి ఆలయంలో సహజ సిద్ధంగా వెలసిన సొరికెలాంటి బండలో వెలసిన కారణంగా బండ మల్లన్నగా పేరు ప్రఖ్యాతలుగా ప్రసిద్ధి చెందింది. ఈ జాతరకు వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లా నుంచే కాకుండా ముంబై, పూణె, జలగావ్, నాందేడ్ పట్టణాలకు చెందినవారు సైతం వచ్చి మల్లన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు.

# క్రీడలతో మానసికోల్లాసం


వాలీబాల్ క్రీడాకారులతో ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, జనవరి 14 : క్రీడలు ఆత్మ విశ్వాసాన్ని పెంచడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తీగుల్ గ్రామంలో పీఏఈఎస్ డైరెక్టర్ భూమయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు క్రీడలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. క్రీడలు ప్రతి ఒక్కరిలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. శారీరక శ్రమ లేకపోవడంతో చాలా మంది రోగాలబారిన పడుతున్నారని తెలిపారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ ఆనందంగా ఆటలు ఆడుకోవాలని సూచించారు. నాయకలు ఇంద్రసేనా రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఐలయ్య, దయానందరెడ్డి, ఎల్లయ్య, శంకర్, నరేశ్ పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం

కొండపాక, జనవరి 14 : క్రీడల్లో గెలుపోటములు సహజమని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం అన్నారు. కొండపాకలోని వేద ఇంటర్నేషనల్ పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో బాలుర విభాగంలో మెదక్ జట్టు విజేతగా నిలువగా, బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు విజేతగా నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిలో బాలుర నుంచి 16 మంది, బాలికల నుంచి 16 మందిని జాతీయ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## షటిల్ పోటీలు

కొమురవెల్లి, జనవరి 14 : మండలంలోని మర్రిముచ్చాలలో మాజీ సర్పంచ్ వంగ బాలనర్సింహారెడ్డి జ్ఞాపకార్థం ఆదివారం షటిల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు.

## వాలీబాల్, కబడ్డీ పోటీలు ప్రారంభం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 14 : ధూళిమిట్ట మండల కేంద్రంలో ‘ధూళిమిట్ట స్పోర్ట్స్ క్లబ్’ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆదివారం సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డితో కలిసి జడ్పీటీసీ కొండల్‌రెడ్డి ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కల్గి ఉండాలన్నారు. నాయకులు కృష్ణ, గద్దల మహేందర్ పాల్గొన్నారు.

# ఘనంగా గోదారంగనాథుల కల్యాణం





హుస్నాబాద్‌లో గోదాదేవి కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

జిల్లాలో గోదాదేవి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేడుకలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.
-సిద్దిపేట జిల్లా నెట్ వర్క్, జనవరి 14

# పండుగలు సంప్రదాయాలకు ప్రతీకలు

రాయపోల్,జనవరి 14 : తెలంగాణ సంస్కృతి సంప్రాదాయాలకు ప్రతీక పండుగలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, ప్రజాయిత పౌండేషన్ వ్యవస్థప అధ్యక్షులు మామిడి మోహన్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగాను పురస్కరించుకొని రాయపోల్ మండల కేంద్రం లో ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా బుధవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిళలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సంక్రాంతి ముగ్గుల పోటీలు దోహదపడుతాయన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాజీ సర్పంచ్ కమ్మరి శ్రీనివాస్‌చారి, బాసం నర్సింహారెడ్డి, యువజన నాయకులు రవీందర్‌రెడ్డి, సత్తుగారి మోహన్‌రెడ్డి, దేశామంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ

వర్గల్, జనవరి 14 : మండలంలోని మజీద్‌పల్లి గ్రామానికి చెందిన గాలం జంపులు శనివారం ప్రమాదశాత్తుపడి ఓ పాడుబడిన బావిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ లతారమేశ్ గౌడ్, సర్పంచ్ బబ్బూరి లతాశివరామ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

## వృద్ధుడు అదృశ్యం

మిరుదొడ్డి, జనవరి : వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండలంలోని కాసులాబాద్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులో కి వచ్చింది. ఆదివారం మిరుదొడ్డి ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రంగనమైన మల్లేశం (70) మానసిక పరిస్థితి బాగ లేకపోడంతో గ్రామంలో ఎక్కడపడితే అక్క డే కూర్చుండి పోయేవాడు. శనివారం సాయం త్రం ఇంటి నుంచి వెళ్లిన మల్లేశం కనిపించకుండా పోయాడు. మల్లేశం కుమారుడు రంగమైన భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైనా వృద్ధుడి ఆచూకీ తెలిస్తే 8712 667327, 9949545517 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## మజీద్ కమిటీ అధ్యక్షుడిగా మౌలానొద్దీన్

మిరుదొడ్డి, జనవరి 14 : దుబ్బాక నియోజకవర్గ మజీద్ కమిటీ అధ్యక్షుడిగా మౌలానొద్దీన్‌ను సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా యూసూఫ్, షకీల్ హమ్మద్, ప్రధాన కార్యదర్శిగా అల్తాఫ్ హుస్సేన్, కోశాధికారిగా సోహెల్, కమిటీ సభ్యులుగా సాజిద్ పాషా, షేక్ షాదూల్‌ను ఎన్నుకున్నారు. అనంతరం మౌలానొద్దీన్ మాట్లాడుతూ మజీద్ సమ్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మౌలానొద్దీన్‌ను ముస్లింలు ఘనంగా సన్మానించారు.

## తపాస్‌పల్లిలో నీళ్ల కష్టాలు


కొమురవెల్లి, జనవరి 14 : మండలంలోని తపాస్‌పల్లి కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం బోగి పండగ పూటనైనా నీళ్లు వస్తాయని మహిళలు ఎదురు చూశారు. నీళ్లు రాకపోవడంతో ఖాళీ బిందెలతో గ్రామ పంచాయతీ వద్ద, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గతంలో గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు క్రమం తప్పకుండా వచ్చేవని, కొంతకాలంగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదన్నారు. మా ఊళ్లో ఉన్న వాటర్ ట్యాంకు నుంచి ఇతర గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు పోతాయని, తమ గ్రామానికే నీళ్లు ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారు.

## పండుగ పూట విషాదం

**రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి**

హుస్నాబాద్, జనవరి 14 : పండుగ పూట హుస్నాబాద్ పట్టణంలో విషాదం నెలకొంది. పట్టణ శివారులోని కరీంనగర్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో శివాజీ నగర్‌కు చెందిన ఎగ్గోజు యశ్వంత్(17) మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు వివరాల ప్రకారం.. హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఎగ్గోజు యశ్వంత్ తన స్నేహితులు నారోజు వెంకటేశ్, ఎగ్గోజు అఖిల్, కేమసారం అజయ్‌తో కలిసి ఏపీ 29, బీఎఫ్ – 9115 నంబర్ గల వ్యాగనార్ కారులో చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న యశ్వంత్‌తోపాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108లో స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే యశ్వంత్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో ముగ్గురు యువకులు చికిత్స పొందుతున్నారు. వీరందరూ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నారు. భోగి పూట యశ్వంత్ ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కొత్త కాంతులను నింపాలి



సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో కొత్త కాంతులను నింపాలని ప్రముఖ చిత్రకారుడు రుస్తుం ఆకాంక్షించారు. మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం సం క్రాంతి చిత్రాన్ని ఆయన ఆవిష్కరించారు.
-సిద్దిపేట టౌన్, జనవరి 14


# ELECTION COMMISSION OF INDIA

## REVISION OF ELECTORAL ROLLS FOR WARANGAL-KHAMMAM-NALGONDA GRADUATES' CONSTITUENCY OF TELANGANA LEGISLATIVE COUNCIL

**Notice under rule 31(4) of the Registration of Electors Rules, 1960**

In pursuance of rule 31 (4) of the Registration of Electors Rules, 1960, the Electoral Registration Officer of Warangal-Khammam-Nalgonda Graduates Constituency vide his notice dated: 30th December, 2023, called upon every person entitled to be registered in the electoral roll of the relevant Graduates constituency mentioned above, to send to, or deliver at, his office on or before 06.02.2024 (ie., the last date of receipt of applications) application in Form-18 appended to the Registration of Electors Rules, 1960 and reproduced in the second schedule of the said notice published in the edition dated 30th December, 2023 of (1) Eenadu, (2) Sakshi and (3) The New Indian Express News Papers.

All the above mentioned persons may submit their applications in Form-18 on or before 06.02.2024 (ie., the last date of receipt of applications), if not already done.

The said details are also available in the official website of the Chief Electoral Offficer, Telangana at **https://ceotelangana.nic.in**

Sd/-
**Electoral Registration Officer**
Warangal-Khammam-Nalgonda
Graduates'Constituency &
Additional Collector Nalgonda